


వద్దు బాబోయ్...!

- చిత్తూరుకు వచ్చేందుకు సబ్‌రిజిస్ట్రార్ల అనాసక్తి
- ఇన్‌చార్జులతోనే నెట్టుకొస్తున్న అధికారులు





చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టాంప్స్‌రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి చిత్తూరులో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్లుగా పనిచేయాలంటే ఆసక్తి చూపడం లేదు.పోస్టింగ్ ఇస్తే దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళిపోతున్నారు.దీంతో ఇక్కడున్న రెండు సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు గత్యంతరం లేని పరిస్థితుల్లో సీనియర్ అసిస్టెంట్లనే ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్లుగా అధికారులు నియమిస్తున్నారు. గత ఆరేళ్ళకాలంలో రెగ్యులర్ ఎస్ఆర్‌లకంటే ఇన్‌చార్జి ఎస్ఆర్‌లే ఎక్కువ మంది పనిచేశారు.ఇటీవలి కౌన్సెలింగ్‌లో కూడా ఇతర ప్రాంతాలకు పోటీ ఎక్కువగా ఉండగా, చిత్తూరు స్థానాన్ని కోరే నాథుడే లేడు.

● 14వేలకు పైగా రిజిస్ట్రేషన్లు

చిత్తూరు జిల్లాలో ఏడాది కాలానికి అత్యధిక సంఖ్యలో అంటే 14వేలకు పైగా రిజిస్ట్రేషన్లు చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే జరుగుతున్నాయి.10వేలకు మించి రిజిస్ట్రేషన్లు జరిగే ప్రాంతాల్లో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లను జాయింట్-1, జాయింట్-2 పేరిట పోస్టులను ప్రభుత్వం సృష్టించింది.చిత్తూరు పాత కలెక్టరేట్ కార్యాలయం పక్కనే వున్న పాత భవనంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగేంతవరకు పరిస్థితులు బాగానే ఉండేవి. 2018 జూలై 21న టీడీపీ ప్రభుత్వ హయాంలో పాత భవనం పక్కన రూ.3కోట్లతో రిజిస్ట్రేషన్ కాంప్లెక్ పేరిట రెండంతస్థుల కొత్త భవనం ఏర్పాటైంది. ఇందులో స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్ (మార్కెట్ వాల్యూ), జిల్లా రిజిస్ట్రార్ (ఆడిట్), జిల్లా చిట్స్ ఆఫీసర్ కార్యాలయాలతో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌లో చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి.అయితే వీధికి ఎదురుగా భవనం ఏర్పాటు చేయడంతో వాస్తుదోషం ఏర్పడిందని ఆఫీసు సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.ఈ కారణంగానే గత ఆరేళ్ళ కాలంలో పలుమార్లు ఏసీబీ తనిఖీలు జరిగాయని, పలువురు సబ్‌రిజిస్ట్రార్లు సస్పెండయ్యారని ప్రచారం జరగడంతో ఇక్కడ పనిచేసేందుకు సబ్‌రిజిస్ట్రార్లు భయపడిపోతున్నారు. నిజానికి రిజిస్ట్రేషన్లు చేసే సమయంలో ఏ సర్వే నెంబరు ఏ నిషేధ భూమిలో ఉందో తెలియక డాక్యుమెంట్ రైటర్లు చెప్పే మాటలను నమ్మి రిజిస్ట్రేషన్లు చేసి సబ్‌రిజిస్ట్రార్లు సస్పెన్షన్లకు గురయ్యారు.ఈ కారణంతోనే సబ్‌రిజిస్ట్రార్ శ్రీధర్‌గుప్తా రెండేళ్ళక్రితం సస్పెండయ్యారు. రెండుసార్లు ఏసీబీ తనిఖీలు జరగ్గా కొందరు సబ్‌రిజిస్ట్రార్లు కేసుల్లో ఇరుక్కోవడంతో జీతాలు ఆపేశారు. దీంతో రెండు సబ్‌రిజిస్ట్రార్ పోస్టులకు ఆరేడుమంది సీనియర్ అసిస్టెంట్లు ఇన్‌చార్జులుగా పనిచేశారు.

● అటు జాయినవడం.. ఇటు సెలవుపై వెళ్లడం

సెప్టెంబరు నెలలో ఇక్కడ జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కుమార్ డిసెంబరులో రిటైర్ కానున్నారు. ఆయన చేరిన రోజు నుంచే డిసెంబరు 15వ తేదీ వరకు రెండు విడతలుగా అనారోగ్య కారణాలు చూపి సెలవుపై వెళ్లారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో హేమంత్‌రాజు అనే సీనియర్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా జిల్లా రిజిస్ట్రార్ మునిశంకరయ్య గత నెలలో నియమించారు.చివరకు ఆయనకే కీలకమైన జాయింట్-1, జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్ పోస్టులు అప్పగించారు.

● దోష నివారణకు వినాయకుడు!

కొత్త భవనానికి వీధిపోటు,వాస్తుదోషం వుండడం వల్లే పలు అనర్థాలు జరుగుతున్నాయని భావించిన అధికారులు దోష నివారణకు గత ఏడాది భవనం వద్ద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొద్దిరోజులకే ఆ విగ్రహాన్ని ఎవరో మాయం చేశారు.ఏమైందోగానీ మూడ్రోజుల తర్వాత దాన్ని యథాస్థలంలో వుంచివెళ్లారు.

జిల్లాకు రెండు విప్ పదవులు

- మండలిలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ ● అసెంబ్లీలో ఎమ్మెల్యే థామస్





చిత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు రెండు విప్ పదవులు వచ్చాయి. శాసనమండలిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, శాసనసభలో జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్‌లకు ఈ అవకాశం దక్కింది. అసెంబ్లీలో ఓ చీఫ్ విప్, 15 మంది విప్‌లతో.. మండలిలో ఓ చీఫ్ విప్, ముగ్గురు విప్‌లతో రెండు జాబితాలను ప్రభుత్వం విడుదల చేసింది.ప్రకాశం జిల్లాకు చెందిన కంచర్ల శ్రీకాంత్ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అధికారంలో ఉన్నా ఓ ప్రణాళిక ప్రకారం గెలుపును దక్కించుకున్నారు. దీంతో చంద్రబాబు ఆయనకు కుప్పం నియోజకవర్గ బాధ్యతల్ని అప్పగించారు. అప్పటి నుంచి ఆయన నియోజకవర్గంలోని సీనియర్లను, శ్రేణుల్ని సమన్వయం చేసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. గత ఎన్నికల్లో కుప్పంలో మెజార్టీ సాధన కోసం ప్రణాళికా బద్ధంగా అందరితో కలిసి పనిచేశారు.ఇకపోతే థామస్ మీద ప్రత్యేక దృష్టితో పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు ఆయనకు జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఫెర్టిలిటీ డాక్టర్‌గా పేరుగాంచిన ఆయన తక్కువ సమయంలో రాజకీయాల్ని అలవాటు చేసుకుని ఎన్నికల్లో మంచి విజయం సాధించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్సీ కోటాలో మంత్రి పదవి వస్తుందని ఆశించిన ఆయనకు మంత్రి మండలిలో చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఇప్పుడు విప్‌గా అవకాశం ఇచ్చారు.వీరికి పదవులు రావడంతో కుప్పం, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

డీసీసీబీ అక్రమాలపై
నత్తనడకన విచారణ



- గడువు ముగిసినా సిద్ధమవని నివేదిక
- ఉద్యోగాలు కాపాడుకోవడం కోసం రుణగ్రహీతల వేటలో సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్/ చిత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ నత్తనడకన సాగుతోంది.డీసీసీబీలో అక్రమాల గురించి జూలై 11, 12 తేదీల్లో ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితం కావడం, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు వీటిపై ఓ నోట్ సిద్ధం చేసి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. అక్టోబరు 10 తేదీన డీసీసీబీ అక్రమాలపై విచారణకు ఆదేశించింది. రెండుమూడు వారాల్లో విచారణ పూర్తి చేసి నివేదిక అందిస్తామన్న అధికారులు ఇప్పటికీ ఆ పని చేయలేదు.గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలకు అడ్డగోలుగా రుణాలు మంజూరు చేసిన డీసీసీబీ అధికారులను కాపాడడం కోసం వారి వెంటబడి మరీ అప్పులు వసూలు చేయిస్తున్నారు.

● అసలేం జరిగిందంటే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి సిఫార్సు మేరకు బైరెడ్డిపల్లెకు చెందిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మను డీసీసీబీ చైర్‌పర్సన్‌గా నియమించారు. ఈమె హయాంలోనే అప్పటి పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా జిల్లావ్యాప్తంగా వైసీపీ నాయకులకు రూ.కోట్లలో రుణాలు మంజూరయ్యాయి. ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలతో స్పందించిన సీఎం చంద్రబాబు విచారణకు ఆదేశించారు. అక్టోబరు 10వ తేదీన సహకార శాఖ కమిషనర్ విచారణ జరిపించి నివేదిక సమర్పించాలని జిల్లా సహకార శాఖ అధికారిణి నాగవర్ధినిని ఆదేశించారు.ఈ నేపథ్యంలో గత నెల 15వ తేదీనే విచారణ బృందం ఏర్పాటైంది. డీసీవో నాగవర్ధిని ఆధ్వర్యంలోని ఈ బృందంలో చిత్తూరు డీఎల్‌సీవో వనజ, డీసీఏవో బ్రహ్మానందరెడ్డితో పాటు 12 మంది కోఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.జిల్లా కేంద్రంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంతో పాటు 12 శాఖల్లో సుమారు రెండు వారాలుగా విచారణ జరుపుతున్నారు.నిజానికి ఎమ్మెల్సీ దొరబాబు డీసీసీబీలో జరిగిన అక్రమాల గురించి పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఏయే శాఖల్లో ఏ వైసీపీ నాయకుడు ఎంత మేరకు రుణాలు తీసుకున్నారనే సమగ్ర వివరాలు అందులో ఉన్నాయి. అందుకే రుణాలు తీసుకున్న వైసీపీ నాయకుల నుంచి బకాయిల్ని వసూలు చేసే పనిలో పడ్డారు. అక్రమ రుణాలు తీసుకున్న వారి వెంటపడి వసూలు చేస్తున్నారు.రుణాలు తీసుకున్నవారే కాదు... మంజూరు చేసినవారు కూడా ఇబ్బంది పడాల్సివస్తుందన్న భయంతో నేతల వెంటబడుతున్నారు.అక్రమాల గురించి నివేదిక సమర్పించాల్సిన అధికారులు విచారణ నత్తనడకన సాగిస్తూవారికి సహకరిస్తున్నారు.

రూ.కోటి రుణాలు వసూలు

డీసీసీబీ కేంద్ర కార్యాలయంతో పాటు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్న 12 శాఖల్లో మేనేజర్లు రుణాల్ని రికవరీ చేస్తుండగా.. ఇప్పటివరకు రూ.కోటి వసూలైనట్లు సమాచారం. డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ భర్త తమ్ముడు రెడ్డెప్ప 2023లో వి.కోట బ్రాంచిలో రూ.40 లక్షల రుణాన్ని ఇంటి నిర్మాణం కోసం తీసుకున్నారు. తాజాగా ఆయన వడ్డీతో కలిపి రూ.45 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా రెడ్డమ్మకు పీఏగా పనిచేసిన జడ్పీ ఉద్యోగి సుధాకర్ గిరింపేట, శ్రీకాళహస్తి బ్రాంచుల్లో రుణాలు తీసుకున్నారు. గిరింపేట బ్రాంచిలోని రుణాన్ని వడ్డీ సహా రూ.5 లక్షలు చెల్లించారు.మిగిలిన శాఖల్లో కూడా మరో రూ.50 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు

జిల్లాలోని వైసీపీ నాయకులకు నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.10 కోట్ల వరకు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. విచారణ జరుగుతుండడంతో హడావిడిగా కొందరు మాత్రం చెల్లించారు. వి.కోట, మదనపల్లె, పలమనేరు, బైరెడ్డిపల్లె, పుంగనూరు తదితర బ్యాంకు శాఖల్లో వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు రూ.40 లక్షలకు మించి నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారు. ఓ కుటుంబంలో ఒకరికే రుణమివ్వాల్సి వుండగా వి.కోటలో ఒకే ఇంట్లోని ఐదుగురికి రూ.40 లక్షల చొప్పున రుణాలు మంజూరు చేశారు. చాలా శాఖల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అలాగే 2022లో జరిగిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై బాధితులు గగ్గోలు పెడుతున్నారు.సొసైటీ ఉద్యోగులకు 25 శాతం ఉద్యోగాలు కేటాయించాల్సివుండగా ఆ మేరకు మంజూరైన 50 పోస్టుల్లో 12 ఉద్యోగాలకు ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల మేర వసూలు చేసినట్లు సమాచారం. ఉద్యోగ అవకాశాలు ఇస్తామని మరికొందరు సొసైటీ ఉద్యోగుల నుంచి కూడా కొంత మొత్తాన్ని వసూలు చేసి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో- బాధితులు పాలకవర్గం, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.



పంచాయతీల్లో ఆన్‌లైన్ ఆడిట్ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తుల్లో 2023-24 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన ఆన్‌లైన్ ఆడిట్ ప్రారంభమైంది. ఖర్చులు, వాటికి సంబంధించిన బిల్లులు, ఓచర్లను పరిశీలిస్తున్నారు.

డిసెంబరు నెలాఖరుకు..

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్రం విడుదల చేసే నిధులను సైతం గత వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో కేంద్రం పలు విధానాలను అమల్లోకి తెచ్చింది. అందులో భాగంగా ఈ ఏడాది ఆడిట్‌ను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించేలా చర్యలు చేపట్టింది. ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించి.. ఆడిట్ నిర్వహించక పోయినా తదుపరి అభివృద్ధి, ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాల్లో జమకావని హెచ్చరించింది. షెడ్యూల్ ప్రకారం నవంబరులోగా ఆడిటింగ్ పూర్తిచేయాల్సి ఉంది. సిబ్బంది కొరత కారణంగా జిల్లాలోని 697 గ్రామ పంచాయతీల ఆడిట్‌ను డిసెంబరు 31వ తేదీలోగా పూర్తిచేస్తారు. అనంతరం వాటిని ఆన్‌లైన్‌లో నమోదు పూర్తిచేస్తారు. వ్యయాలపై అభ్యంతరాలు ఉంటే వాటిని పరిష్కరించడానికి మూడు నెలల తర్వాత తుది నివేదికను 2025 మార్చి ఆఖరునాటికి ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

గతానికి భిన్నంగా.. : గతంలో మాన్యువల్‌గా జరిగిన ఆడిట్ ప్రక్రియను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. రికార్డులను సరిచూశాక వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

అలసత్వం వహిస్తే నిధులు రావు

జిల్లాలో 65శాతం ఆడిట్, ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసింది. ఆడిట్ ఫైళ్ల సమర్పణకు సంబంధిత అధికారులు ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా పంచాయతీలకు తదుపరి అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆడిట్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించాం.

- కృష్ణారెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి, చిత్తూరు

పార్టీ విధేయులకు పట్టం

- పదిమందికి కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా అవకాశం

చిత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల వేధింపులను సమర్థంగా ఎదుర్కోవడమే కాక ఇటీవలి ఎన్నికల్లో కూటమి పార్టీల విజయానికి కృషి చేసిన నాయకులను వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నియమించారు.పదిమంది జిల్లా నాయకులకు చోటు దక్కగా.. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్‌లో ఏడుగురు, కురబ కార్పొరేషన్‌లో ముగ్గురు ఉన్నారు.వీరిలో తొమ్మిదిమంది టీడీపీ నాయకులు కాగా, ఒకరు జనసేనకు చెందినవారున్నారు. పదిమందిలో ఆరుగురు డైరెక్టర్లు కుప్పం నియోజకవర్గానికి చెందిన వారే ఉన్నారు.వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా శాంతిపురం మండలానికి చెందిన రుద్రప్ప, ఎన్.చంద్రశేఖర్,పెద్దచిన్నప్ప వామన(జనసేన), గుడుపల్లె మండలానికి చెందిన ఆర్.చంద్రశేఖర్ , డీవీ అరుణాచలం,కార్వేటినగరం మండలానికి చెందిన రాజేంద్రరెడ్డి,నగరి మండలానికి చెందిన శ్రీనివాసులు నియమితులయ్యారు.అలాగే తిరుపతి జిల్లా పుత్తూరు మండలానికి చెందిన షణ్ముగ రెడ్డిని కూడా నియమించారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కుప్పం మండలానికి చెందిన ఎం.రాజగోపాల్ ,పలమనేరు మండలానికి చెందిన సుబ్రమణ్యం గౌడ్,రొంపిచెర్ల మండలానికి చెందిన ఉయ్యాల రమణ వున్నారు.


ఆర్.చంద్రశేఖర్


అరుణాచలం


రుద్రప్ప


ఎన్.చంద్రశేఖర్


పెద్దచిన్నప్ప


ఉయ్యాల రమణ


రాజేంద్రరెడ్డి


సుబ్రమణ్యం గౌడ్

ఇక పోలీసు వద్దా ఆధార్

- నేర పరిశోధనలో మరింత వేగం

తిరుపతి(నేరవిభాగం),నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసు శాఖకు ఆధార్ అనుసంధానం కానుంది. ఇప్పటివరకు నేరస్థులు, అసాంఘిక శక్తుల వేలి ముద్రలు, కనుబొమ్మలు మాత్రమే పోలీసు శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయి.వీటివల్ల నేరపరిశోధనలో అనుకున్న స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో ఇకపై ఆధార్ కార్డులను పోలీసు శాఖకు అనుసంధానం చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలోని ప్రతి ఒక్కరి ఆధార్ కార్డును పోలీసు శాఖకు అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆధార్ డేటాను పర్యవేక్షించే యూనిక్ ఐడెంటిఫికేషన్ యాప్‌ను అందుబాటులోకి తేనుంది. దీంతో పాటు ప్రభుత్వంపైన, ప్రభుత్వ పెద్దలపైన సోషల్ మీడియాను వేదికగా చేసుకుని విమర్శలు, ఆరోపణలు చేస్తున్న వారిని ఆధార్ నెంబరు ఆధారంగా గుర్తించే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రాథమికంగా తొలి దశలో దాదాపు లక్ష నుంచి రెండు లక్షల మంది ఆధార్ కార్డులు పోలీసు యూనిక్ ఐడీతో అనుసంధానం చేసి తద్వారా వచ్చే ఫలితాలను బట్టి మిగిలిన వారి ఆధార్‌ను పోలీసు శాఖకు అనుసంధానం చేయనున్నారు.

టీచర్ల ఊరు.. కార్వేటినగరం



కార్వేటినగరం.. దీన్ని టీచర్ల ఊరుగానూ పిలుస్తారు. ఎందుకంటే ఇప్పటి వరకు ఈ ఊరివారు 600 మంది వరకు టీచర్లు అయ్యారు. వీరంతా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్నారు. ఇంతమంది ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ చూపడానికి ఇక్కడున్న డైట్ (జిల్లా విద్యా శిక్షణా సంస్థ)నే స్ఫూర్తిగా వారు చెబుతున్నారు. ఇక డైట్‌లో సీటొస్తే డీఎస్సీలో ఉద్యోగం వచ్చినట్లేనని భావిస్తారు. ఉదాహరణకు 2008లో నిర్వహించిన డీఎస్సీలో ఇక్కడ శిక్షణ పొందిన వారిలో 97 మంది టీచర్ పోస్టులు సాధించారు.

- వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి

గురువుల మాట

వృత్తిపై మక్కువతో..



ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో డైట్‌లో శిక్షణ పొందా. 2001 డీఎస్సీలో ఉద్యోగం వచ్చింది. కార్వేటినగరం మండలంలోని పాదిరికుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నా.

- కె.సుప్రసన్న

పూర్వజన్మ సుకృతం



టీచరుగా పనిచేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. 2001 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యా. ప్రస్తుతం కార్వేటినగరం మండలం గంగమాంబాపురంలో పనిచేస్తున్నా.

- గిరిబాబు

ఊర్లో డైట్ ఉండటం వల్లే



కార్వేటినగరంలో డైట్ ఉన్న కారణంగా ఇక్కడ 1986-87లో టీచరు ట్రైనింగ్ పూర్తిచేశా. 1989 డీఎస్సీలో ఎంపికై అదే ఏడాది ఆగస్టులో ఉపాధ్యాయుడిగా బంగారుపాళ్యంలో చేరా. ఆ తర్వాత పాలసముద్రం, కార్వేటినగరం, చంద్రగిరిలో పనిచేశా. ప్రస్తుతం ఆర్సీపురంలో స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్నాను. ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, ఫ్యాప్టో కో-చైర్మన్‌గా పనిచేసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాటం చేశా.

- గాజుల నాగేశ్వరరావు

డైట్ వల్లే టీచర్ అయ్యా



కార్వేటినగరంలో డైట్ ఉండటం వల్ల టీచర్ ట్రైనింగ్‌వైపు అడుగులు వేశాను. 1988 డీఎస్సీలో ఉపాధ్యాయుడై కార్వేటినగరం, వెదురుకుప్పం, వి.కోట, తిరుపతి మండలాల్లో పనిచేశాను. ప్రస్తుతం బంగారుపాళ్యం మండలంలో టీచరుగా పనిచేస్తున్నా.

- ఢంకా హమీద్

సొంతూరులో పనిచేస్తున్నా



1989 డీఎస్సీలో స్పెషల్ టీచర్గా ఎంపికయ్యా. పుత్తూరు, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో పనిచేసి.. ప్రస్తుతం డైట్‌లోనే సైన్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నా. సొంతూరులో చదువుకున్న చోటే పనిచేయడం సంతోషంగా ఉంది.

- పూసపాటి నిర్మల

టీచరు వృత్తి ఉన్నతమైంది



టీచరు వృత్తి ఉన్నతమైంది. 1998 డీఎస్సీలో టీచరు పోస్టు వచ్చింది. ప్రస్తుతం విజయపురం మండలం జంబాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా.

- రామిశెట్టి డిల్లీలా



తిరుమలలో కొలువుదీరిన పంచమూర్తుల్లో ఒకరైన ఉగ్రశ్రీనివాసుడు ఏటా ఒకసారి మాత్రమే గర్భాలయం దాటి వస్తారు. కైశికద్వాదశి ఆస్థానం సందర్భంగా వేకువజామున మాడవీధుల్లో ఊరేగి.. సూర్యోదయానికి ముందే తిరిగి లోపలకు వెళ్లిపోతారు. శ్రీవారి ఆలయంలో బుధవారం ఈ ఉత్సవం జరగనుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వైసీపీలో రసవత్తరంగా వర్గపోరు



జగన్‌తో మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి తదితరులు

తడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ వర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుకూల, వ్యతిరేక వర్గాలుగా పార్టీ ఎప్పుడో చీలిపోయింది. సంజీవయ్యకు టిక్కెట్ ఇస్తే పనిచేసేది లేదంటూ ఎన్నికలకుముందు చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వర్గం స్పష్టంచేశాయి. ఇవేవీ పట్టించుకోని అధిష్ఠానం 3వ సారి కిలివేటి సంజీవయ్యకే టిక్కెట్ కేటాయించడంతో ఆ ఎన్నికల్లో వీరంతా కొంత వ్యతిరేకంగా పనిచేశారన్న ప్రచారం జరిగింది. కూటమి అధికారంలోకి రావడంతో దువ్వూరు బాలచంద్రారెడ్డి టీడీపీలో చేరతానంటూ ప్రకటించడంతో ఆ వర్గం నాయకులంతా ఆ పార్టీలో చేరతారనే ప్రచారం జరిగింది. ఈ వర్గం టీడీపీలో చేరేందుకు ఆ పార్టీలో ఉన్న ఒక వర్గం అడ్డుకోవడంతో దువ్వూరు వర్గం చేరిక వాయిదాపడింది. ఈ క్రమంలో సంజీవయ్య వర్గం గత శుక్రవారం వైసీపీ అధినేత జగన్‌ను కలిసి మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి వర్గంపై ఫిర్యాదు చేశారు. టీడీపీతో తిరుగుతూ పార్టీ ఓటమికి కృషి చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి ప్రధాన కారణమంటూ వివరించారు. జగన్ ఆదేశాలతో ఉమ్మడి నెల్లూరుజిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శేఖర్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీచేశారు. అదే సమయంలో మంగళవారం మధ్యాహ్నం మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వర్గం నాయకులు తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిశారు. షోకాజ్ నోటీసు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. తమను కిలివేటి సంజీవయ్య కలుపుకుపోవడంలేదని వారు సైతం ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. అన్నింటిని పక్కనపెట్టి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని జగన్ చెప్పినట్లుగా తెలుస్తుంది. జగన్‌ను కలసినవారిలో దబ్బలతోపాటు కళత్తూరు శేఖర్‌రెడ్డి, తడ ఎంపీపీ కొలవి రఘురెడ్డి, నాయకులు గండవరం సురేష్‌రెడ్డి, ఉచ్చూరు మునస్వామిరెడ్డి, తిరుపాల్, శరత్‌యాదవ్ తదితరులున్నారు.

ఇద్దరు అర్చకులకు షోకాజ్ నోటీసులు

ఎర్రావారిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వరాలయంలో భక్తుల ఎదుటే ఘర్షణకు దిగిన ఇద్దరు అర్చకులకు దేవదాయశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఆలయంలో ప్రసన్నకుమార్‌స్వామి, సత్యప్రసాద్‌లు అర్చకులుగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో అప్పటి ఈఓ జయకుమార్ సిఫార్సుతో ప్రస్నకుమార్ స్వామి కుమారుడిని తాత్కాలిక అర్చకుడిగా నియమించారు. కొద్ది రోజులు అతను పనిచేశారు. అర్చకుల సెలవుల సందర్భంలో సేవలందిస్తున్నారు. ఈయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ మరో అర్చకుడు సత్యప్రసాద్ దేవదాయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు అర్చకుల మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరూ ఇటీవల భక్తుల ఎదుటే కొట్టుకున్నారని సమాచారం. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో కూడా నమోదయ్యాయి. దీంతో ఆలయ ఈఓ మమత విచారించి మంగళవారం ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కాలువలో పడి చిన్నారి మృతి



లహరి (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాలువలో పడి చిన్నారి మృతి చెందింది. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన వివరాలు... శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మధు శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు. నింద్ర ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఉపాధ్యాయుడు.ఈ దంపతులు శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డులో సాయినగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్య కల్పన గృహిణి. వీరికి నాల్గో తరగతి చదివే కుమారుడు, ఆరేళ్ల చిన్నారి లహరి ఉన్నారు. కుమార్తె లహరి మానసికంగా పరిణితి చెందలేదు. దీంతో ప్రత్యేక ప్రతిభావంతురాలైన బాలికను తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలోని భవిత కేంద్రంలో సోమవారం చేర్పించారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామంలో లహరి భవిత కేంద్రం వద్ద అదృశ్యమైంది. సిబ్బంది వెంటనే బాలిక తల్లిదండ్రులు, రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నారి ఆచూకీ కోసం అందరూ గాలించారు. భవిత కేంద్రం సమీపంలో కాలువలో పడి బాలిక మృతి చెందినట్లుగా కాసేపటి తరువాత గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రశ్రీనివాసుడు

గడప దాటేది ఏడాదికోసారే

- 800 ఏళ్ల కిందటి వరకు ఈయనే ఉత్సవమూర్తి
- ఓ సంఘటనతో ఆ స్థానంలోకి మలయప్ప
- నేడు శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి ఆస్థానం

తిరుమల గర్భాలయంలో మూలవిరాట్‌తో పాటు మరో నలుగురుమూర్తులు ఉంటారు. కోర్కెలు తీర్చేది ధ్రువబేరమైన మూలమూర్తి అయితే.. నిత్యసేవలు భోగ శ్రీనివాసమూర్తి (కౌతుకబేరం) అందుకుంటారు. లెక్కలు అందుకునే స్వామి కొలువు శ్రీనివాసమూర్తి(బలిబేరం). మలయప్ప(ఉత్సవబేరం)ను భక్తులంతా తరచూ వీక్షిస్తుంటారు. ఉత్సవాల సమయంలో ఆలయం నుంచి బయటకు వివిధ వాహనాలపై దర్శనమిచ్చేది ఈ స్వామే. ఐదోవది స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తి. ఈయన్ను 'వెంకటంత్తురైవారు' అని కూడా పిలుస్తారు. 14వ శతాబ్దం వరకు ఉగ్రశ్రీనివాసుడే ఉత్సవమూర్తిగా ఉండేవారని పురాణోక్తి.

ఆ పేరు వెనుక..

ఉగ్రశ్రీనివాసుడని పేరు రావడానికి ఓ ఇతిహాసం ప్రాచుర్యంలో ఉంది. క్రీ.శ.1330 నాటి బ్రహ్మోత్సవాల్లో ఉత్సవమూర్తి ఊరేగుతుండగా ఈ స్వామిపై సూర్యకిరణాలు పడ్డాయట. దీంతో తిరుమలలో పెద్ద అగ్నిప్రమాదం జరిగి చాలా ఇళ్లు దగ్ధమయ్యాయట. ఈ క్రమంలోనే సమీపంలోని భక్తుల్లో ఒకరి ద్వారా 'ఇకపై నన్ను ఉత్సవమూర్తిగా వాడద్దు. అలా చేస్తే అగ్నిప్రమాదం వంటి అనర్థాలే జరుగుతాయి' అని స్వామి చెప్పారట. తిరుమల లోయల్లో తానే ఇంకొకమూర్తిగా శ్రీదేవి, భూదేవి సహా సహా ఉన్నానని, ఎక్కడ వెతకాలో గుర్తులు కూడా చెప్పారట. ఆ స్వామినే (ప్రస్తుత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి) ఉత్సవమూర్తిగా కొలువుదీర్చాలని ఆదేశించారట. అప్పట్నుంచి ఉగ్రశ్రీనివాసమూర్తిగా పేరు వచ్చింది.

నేడు స్వామివారి ఊరేగింపు

ఏటా శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి ఆస్థానాన్ని నిర్వహిస్తారు. ఆ ఒక్కరోజు మాత్రమే ఉగ్రశ్రీనివాసమూర్తి వేకువజాము ఆలయం నుంచి బయటకు వచ్చి నాలుగు మాడవీధుల్లో ఊరుగుతారు. సూర్యకిరణాలు పడకముందే తిరిగి స్వామిని ఆలయంలోకి తీసుకెళ్లిపోతారు. ఈ ఉత్సవం బుధవారం జరగనుంది.

మా డబ్బు మాకు వెనక్కివ్వండి

- తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన



ఎయిర్ అలయన్స్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో మంగళవారం ప్రయాణికులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్ నుంచి ఉదయం 7.15గంటలకు తిరుపతికి చేరుకుని తిరిగి హైదరాబాద్‌కు 8.15 గంటలకు వెళ్లాల్సిన ఎయిర్ అలయన్స్ విమానాన్ని సాంకేతిక కారణాలతో సోమవారం హైదరాబాద్‌లోనే రద్దు చేశారు.ఈ విమానంలో సోమవారం హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికులకు సమాచారం ఇవ్వడంతో కొంత మంది నగదు వెనక్కు తీసుకుని వెళ్లగా కొంత మంది మంగళవారం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరిలో 40మంది మంగళవారం ఉదయం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. సాంకేతిక కారణాలతో విమానం రద్దయినట్టు సిబ్బంది చెప్పడంతో ప్రయాణికులు సహనం కోల్పోయి ఆందోళనకు దిగారు. ప్రతిసారీ ఇలా సాంకేతిక కారణాలు చూపుతూ రద్దు చేయడంపై సిబ్బంది మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డబ్బు వెనక్కిస్తే వేరే విమానంలో వెళతామని చెప్పగా సంస్థ సిబ్బంది సమాధానం చెప్పలేదు. దీంతో ప్రయాణికులు వారిని చుట్టుముట్టడంతో 48 గంటల తరువాత ప్రయాణికుల ఖాతాల్లో టిక్కెట్ల బుకింగ్ వాపస్ డబ్బు పడుతుందని చెప్పారు.దీంతో కొంతమంది వెనుదిరగ్గా మరికొంతమంది వేరే విమానంలో టిక్కెట్లు బుక్ చేసుకుని హైదరాబాద్‌కు పయనమయ్యారు.

ఉన్న పంటను సాగు చేసుకోండి

- కళత్తూరు దళితులకు కలెక్టర్ భరోసా

కేవీబీపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వివాదంలో ఉన్న భూముల్లో ప్రస్తుత సాగును పూర్తి చేసుకోవాలని కొత్తసాగుకు అనుమతి లేదని కలెక్టర్ చెప్పారు. మండలంలోని అటవీశాఖ భూ వివాదంపై మంగళవారం కళత్తూరు దళిత రైతులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను, డీఎఫ్‌వో వివేక్‌ను కలిసి తమగోడును వినిపించారు. స్పందించిన అధికారులు ప్రస్తుతానికి వివాదంలో ఉన్న నేలలో జరుగుతున్న సాగును పూర్తి చేసుకోవాలన్నారు. కొత్తగా పంటలు పెట్టొద్దని కలెక్టర్, డీఎఫ్‌వో చెప్పారు. దీంతో రైతులు ప్రస్తుతం వేరుశనగ సీజన్ కాబట్టి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరినా డీఎఫ్‌వో అంగీకరించలేదు. సాగులో ఉన్న పంటకు మాత్రమే అనుమతి ఇస్తున్నామని మిగిలిన దాంట్లో అడుగుపెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని అప్పటి వరకు సంయమనం పాటించాలన్నారు. టవర్లను ఎక్కడం మానుకోవాలని హితవు పలికారు. దీంతో రైతులు వెనుదిరిగారు.

టీడీపీ వర్క్‌షాప్‌కు బహిష్కృత ఎమ్మెల్యే



సత్యవేడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ వర్క్‌షాప్‌కు ఆ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే ఆదిమూలం హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఆయనపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో సెప్టెంబరు 5న పార్టీ నుంచి సస్పెండు చేసిన విషయం తెలిసిందే. లైంగిక ఆరోపణల కేసు హైకోర్టులో వీగిపోవడంతో ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నియోజకవర్గ నా యకులు అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో బడ్జెట్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరు కావడం స్థానికంగా చర్చకు దారి తీసింది.

తిరుమలలో సినీ హీరోలు



మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న సినీ హీరో మంచు విష్ణు



శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్న సినీ కథానాయకుడు వరుణ్‌తేజ్



క్యాన్సర్‌పై అవగాహన పోస్టరును విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

రేపటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

- ప్రతి బృందం రోజుకు 5 కుటుంబాలకు పరీక్షలు చేయాలన్న కలెక్టర్

తిరుపతి(వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్‌ను నిర్మూలించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం నుంచి ఇంటింటికి వెళ్లి నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించి మంగళవారం ఆయన స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రతి వైద్యుడు, సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించి ఈ నెల 18 నుంచి నిర్వహించే పలు వైద్య పరీక్షల సమాచారాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయాలని వైద్యాధికారులకు సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, గుండె జబ్బులు, థైరాయిడ్, పక్షవాతం వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలను స్నేహపూర్వకంగా నిర్వహించాలన్నారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనికి ఏర్పాటు చేసిన బృందాలు రోజుకు 5 కుటుంబాలను కలిసి వైద్య పరీక్షలు చేయాలన్నారు. వైద్యాధికారులతో కలిసి క్యాన్సర్ అవగాహన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారధిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏది గోల్డు.. ఏది రోల్డు?

- టౌన్ బ్యాంకులో అప్రైజర్ చేతివాటం
- కుటుంబ సభ్యుల పేరిట నకిలీ బంగారం తాకట్టు
- ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సస్పెన్షన్
- ఆందోళనలో ఖాతాదారులు

బ్యాంకుల్లో అసలు గోల్డ్ ఏదో, రోల్డ్ గోల్డ్ ఏదో తేల్చాల్సింది అప్రైజర్. బంగారు నాణ్యతను పరీక్షించి గ్రాముకు ఎంతివ్వాలో నిర్ణయించేదీ అతడే. అప్రైజర్‌ను మెప్పిస్తేనే అనుకున్న రుణం దొరుకుతుంది. లేకుంటే బంగారంలో రాళ్లున్నాయని కోతలేస్తుంటారు. అదే అప్రైజర్ తలుచుకుంటే నకిలీ బంగారు కూడా అసలైపోతుంది. తాజాగా తిరుపతి టౌన్‌బ్యాంకులో ఓ అప్రైజర్ చేతివాటం బ్యాంకు వర్గాల్లో కలకలం రేపింది. ఖాతాదారుల్లో ఆందోళన కలిగించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన తిరుపతి టౌన్ బ్యాంకులో అప్రైజర్లు చేతివాటం చూపించడం ఇది రెండోసారి. 30 ఏళ్ల కిందట ప్రభాకర్ అనే అప్రైజర్ దొంగ బంగారం తనఖాపెట్టి వేలల్లో కాజేసి దొరికిపోయాడు. తాజాగా టౌన్‌బ్యాంకుతిరుమల శాఖలో చేరిన రూపేష్ తన భార్య, అమ్మ పేరిట నకిలీ బంగారం పెట్టి రూ.ఆరు లక్షలు కాజేయడంతో ఖాతాదారుల్లో ఆందోళన కలిగించింది. ఏడాది తర్వాత రెన్యువల్ చేసుకునే క్రమంలో బ్యాంకు అధికారులకు అనుమానం వచ్చి తనిఖీ చేయించగా అసలు గుట్టు ఆలస్యంగా బయటపడింది. విచారణలో వెల్లడికావడంతో నగదును రికవరీ చేసి విధులనుంచి సస్పెండ్ చేశారు. కాగా, టౌన్ బ్యాంకులోని వివిధ శాఖలో ఐదుగురు అప్రైజర్లు పనిచేస్తున్నారు. గతంలో తరుచూ అంతర్గత బదిలీలు లేకపోవడంతో ఒకేశాఖలో దీర్ఘకాలం ఉండేవారు. దీంతో అవకతవకలకు పాల్పడే అవకాశం ఏర్పడింది. ఇందులో భాగంగానే తిరుమల బ్యాంకులో పని చేసే రూపేష్ తన చేతివాటాన్ని చూపాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక అప్రైజర్ల అంతర్గత బదిలీలు చేయడంతో నకిలీ బంగారం వెలుగులోకి వచ్చింది. లేకుంటే అదే అప్రైజర్ ఉండుంటే ఈ నకిలీ బంగారం రెన్యువల్ అయిపోయేది. కాగా, గతంలో టౌన్‌బ్యాంకులోని అన్ని శాఖల్లో రోజుకు రూ.50లక్షల వరకు బంగారు రుణాలను ఖాతాదారులు పొందేవారు.బ్యాంకు మీద విశ్వాసం సన్నగిల్లడంతో ప్రస్తుతం రూ.20లక్షల రుణాలు కూడా తీసుకోవడంలేదు. ఈ ఘటన నేపథ్యంలో అన్ని శాఖల్లో తనఖా ఉన్న బంగారాన్ని తనిఖీ చేసి ఖాతాదారులకున్న అనుమానాలను తెరదించాల్సిన బాధ్యత టౌన్‌బ్యాంకు పాలకమండలి, అధికారయంత్రాంగంపై ఉంది.అడ్డంగా దొరికినప్పుడు ఉద్యోగం నుంచి తప్పించి చేతులు దులుపుకొంటున్నారే గానీ చట్టపరమైన చర్యలకు బ్యాంకు వర్గాలు వెనకడుగు వేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

జాతీయ బ్యాంకుల్లోనూ..

కోఆపరేటివ్ బ్యాంకుల్లోనే కాకుండా జాతీయ బ్యాంకుల్లోనూ అప్రైజర్లు అప్పుడప్పుడూ నకిలీ బంగారం పెట్టి నగదు స్వాహా చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. జాతీయ బ్యాంకుల్లో కమీషన్ పద్ధతి కింద అప్రైజర్లు పనిచేస్తుంటారు. ఏళ్ల తరబడి ఒకే శాఖలో ఉండటంతో అవకతవకలు జరిగే అవకాశంలేకపోలేదు. 'దొరికినవాడు దొంగ దొరకనివాడు దొర' అన్నట్టుగా కొందరు అప్రైజర్లు చెలామణి అవుతున్నారన్న విమర్శలున్నాయి.

తనఖా బంగారాన్నంతా తనిఖీ చేస్తున్నాం

టౌన్ బ్యాంకు పరిధిలోని తనఖా ఉన్న బంగారన్నంతా తనిఖీ చేస్తున్నాం. ఇప్పటికే తిరుమల శాఖలో బంగారాన్ని పరిశీలించాం. పునఃతనిఖీ కోసమే మాజీ సీనియర్ అప్రైజర్ ఎం.వేదాచలంను నియమించాం. ఆయా శాఖల మేనేజర్లతో కలిసి తన ఖాలో ఉన్న బంగారాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని లేఖలు రాశాం. రూపేష్‌ను సస్పెండ్ చేశాం. కమిటీ నిర్ణయం తర్వాత డిస్మిస్ చేస్తాం. ప్రస్తుతం రెండు, మూడు నెలలకోసారి అప్రైజర్లను అంతర్గతంగా బదిలీచేసేలా నిర్ణయం తీసుకున్నాం. ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. వారి బంగారు సురక్షితం.

- శివకుమార్‌రెడ్డి, ఎండీ, తిరుపతి టౌన్ బ్యాంకు

రేపటినుంచి గ్రంథాలయ వారోత్సవాలు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక పఠనం, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వివిధ పోటీలు, 19న రంగవల్లి, అల్లికలపై పోటీలు, 20వ తేదీన ముగింపు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.


శశికుమార్ వద్ద టీ, జ్యూస్‌లు తాగుతున్న పెద్దలు, పిల్లలు

ఆరోగ్యాన్నిస్తూనే.. ఆదాయం

ఓ యువ రైతు వినూత్న ఆలోచన

తాగే నీటి నుంచి ఆహారం వరకు అన్నింటినీ కల్తీ చేసేస్తున్నారు. దీనివల్ల చాలామంది రోగాల బారిన పడుతున్నారు. దీన్ని గమనించిన చిత్తూరులోని 46వ వార్డు పంత్రాంపల్లెకి చెందిన యువ రైతు శశికుమార్ తనవంతుగా సమాజానికి ఎంతో కొంత మేలు చేస్తూ.. ఆదాయం పొందాలని వినూత్నంగా ఆలోచించాడు. దీంతో చాలావరకు తన ఇంటి పెరట్లో పండించే కూరగాయలు, ఆకులతో టీ, జ్యూస్‌లను విక్రయిస్తూ పదిమందికీ ఆరోగ్యాన్నిస్తూనే.. ఆదాయాన్నీ గడిస్తున్నాడు. నగరంలోని అంబేడ్కర్ భవనం ఎదుట(ఫారెస్ట్) ఓ గొడుగు కింద రోజూ ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు శశికుమార్ వివిధ రకాల టీ, జ్యూస్‌లను విక్రయిస్తున్నాడు. ఇతని వద్ద జామాకు, క్యారెట్, కొత్తిమీర, పుదీనాలతో చేసే టీలు, నవధాన్యాలు సూప్, బూడిద గుమ్మడికాయ, అరటి బోద, ఉసిరికాయ, బీట్రూట్, క్యారెట్, గరిక జ్యూస్‌లు లభిస్తాయి. టీ, జ్యూస్ ఏదైనా రూ.20 మాత్రమే. రోజుకు 80 నుంచి 100 మంది వరకు పిల్లలు, పెద్దలు వీటిని సేవిస్తుంటారు.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి



తగిన నష్టపరిహారం చెల్లించాలి

బాధిత రైతుల ధర్నా - ఆర్డీవో హామీతో విరమణ

యాదమరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై - బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రహదారి విస్తరణ దృష్ట్యా 440 కేవీ విద్యుత్ స్తంభాలు నాటే, తీగలు లాగే మార్గంలో భూమికి, కొబ్బరి, మామిడి తదితర చెట్లకు తగిన నష్టపరిహారం ఇవ్వాలంటూ యాదమరి మండలంలోని బాధిత రైతులు ధర్నాకు దిగారు. కోడిగుట్ట - బండివాళ్లూరు మధ్యన రహదారి పక్కన మంగళవారం పుల్లయ్యగారిపల్లె, కోడిగుట్ట, బండివాళ్లూరుకు చెందిన రైతులు నిరసనకు దిగారు. తమ భూముల్లో నాటే విద్యుత్ స్తంభాలకు, పొలాల మీదుగా వెళ్లే తీగల కింద ఉండే కొబ్బరి, మామిడి తదితర చెట్లకు నామమాత్రంగా నష్టపరిహారం ఇస్తున్నారన్నారు. కర్ణాటక - తమిళనాడు తరహాలోనే ఇక్కడా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే జరుగుతున్న పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, యాదమరి తహసీల్దార్ పార్థసారథి, ఆర్ఐ ప్రసాద్‌లతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నేషనల్ హైవే అధికారుల ఆధ్వర్యంలో కాంట్రాక్టరుతో మాట్లాడి తగిన నష్టపరిహారం అందేలా చూస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


ధర్నా చేస్తున్న రైతులు

రెవెన్యూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

గంగవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం పలమనేరులోని ఆర్డీవో కార్యాలయంలో జేసీ విద్యాధరితో కలిసి పలమనేరు, కుప్పం నియోజకవర్గాల ఆర్డీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్షించారు. బదిలీల తర్వాత కొత్త స్థానాలకు వచ్చిన తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల స్థితిగతులపై పట్టు సాధించాలన్నారు. ముఖ్యంగా భూములపై కోర్టుల్లోని కేసులపై తహసీల్దార్లు లేకుంటే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు హాజరై పరిష్కరించేలా చూడాలని చెప్పారు. ఆర్వోఆర్ అప్పీళ్లపై ప్రతివారం ఐదు నుంచి పది కేసులైనా పరిష్కరించాలన్నారు. ఇటీవల నిర్వహించిన రీసర్వే గ్రామసభల్లో 90శాతం ఫిర్యాదులు భూమి విస్తీర్ణం, ఎల్పీఎం నెంబర్లకు సంబంధించే ఉన్నాయని వివరించారు. ఈ ఫిర్యాదులపై యాక్షన్ ప్లాన్ ఏర్పాటు చేసుకుని మ్యుటేషన్ దరఖాస్తులు సరిచేసి.. దూరప్రాంతాలకు చెందిన ప్రజలు, రైతులతో గూగుల్ మీట్ ద్వారా విచారించి పరిష్కరించాలని సూచించారు.

మూడు నెలల షెడ్యూల్ రూపొందించండి

రెవెన్యూపై వచ్చిన ఫిర్యాదులన్నింటినీ సకాలంలో పరిష్కరించడానికి అధికారులు, సిబ్బంది కలసి మూడు నెలల షెడ్యూల్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. నిర్ణీత గడువులోపు పరిష్కరించి.. రైతులకు ఉపశమనం కలిగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, కుప్పం ఆర్డీవోలు భవాని, శ్రీనివాస్‌రాజు, డీఎస్‌వో శంకర్, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల డిప్యూటీ తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సుమిత్‌కుమార్

తిరుపతి సర్కిల్‌కు మిగిలింది ఐదు డివిజన్లే

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్ (ఉమ్మడిచిత్తూరుజిల్లా)లో మొత్తం 8 డివిజన్లు ఉండేవి. నూతన జిల్లాలు ఏర్పడిన అనంతరం, నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లా(తిరుపతి సర్కిల్)కు ఐదు డివిజన్లు కోల్పోయింది. అదనంగా రెండు డివిజన్లు చేరడంతో ఐదు డివిజన్లకు పరిమితమైంది. నూతన తిరుపతి విద్యుత్ సర్కిల్‌లో తిరుపతి టౌన్,రూరల్,పుత్తూరు మూడు డివిజన్లతో పాటు నూతనంగా నాయుడుపేట, గూడూరు డివిజన్లు అదనంగా కలిశాయి. నూతన జిల్లాల విభజన జరిగిన అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా(తిరుపతి సర్కిల్) నుంచి చిత్తూరు, రాయచోటి సర్కిళ్లు నూతనంగా ఏర్పడ్డాయి. ఈ నెల 10వ తేది నుంచే నూతన సర్కిళ్లకు కార్యనిర్వాహక విధులు, ప్రాజెక్టులు మంజూరు చేసే పనులు ఎస్ఈకి అప్పగించారు.ఈ నెల ఒకటో తేది నుంచి నూతన సర్కిల్స్‌లో విధులు నిర్వహించాలని సీఎండీ ఆదేశించారు. అయితే తిరుపతి సర్కిల్ కార్యాలయం నుంచి సిబ్బందిని బదిలీ చేయాలి. ఈ బదిలీలు చేయడంలో జాప్యం జరగడంతో నూతన సర్కిల్ కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడంలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్కిల్ కేంద్రాల్లో ఒకటో తేది నుంచి వినియోగదారులకు సేవలందడం లేదు. డిసెంబరు ఒకటి నుంచి నూతన సర్కిల్ కార్యాలయాల నుంచి కార్యనిర్వాహక కార్యకలాపాలు నిర్వహించడానికి సర్కిల్ స్థాయి అధికారులు చర్యలు చేపట్టారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చిల్లకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.23 వేల జరిమానా విధిస్తూ నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి చిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పునిచ్చారు. 2021లో చిల్లకూరు మండలంలోని ఓ బాలిక బహిర్భూమికి వెళ్లగా.. మస్తాన్‌బాబు బలాత్కరించాడు. ఇతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నెల్లూరులోని పోక్సో కోర్టులో విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 23వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

కంగుందిలో నేడు 'ప్రజా దర్బార్'

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం ప్రాంత అభివృద్ధికోసం కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేశారు. కడా పీడీగా ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్‌ను నియమించారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను పీడీ నిర్వహిస్తూ.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అలాగే కలెక్టర్ సుమిత్ కుమార్ సైతం ప్రతి శుక్రవారమూ కుప్పం వచ్చి పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నారు. అయినా వచ్చిన సమస్యలే ప్రజలనుంచి పదే పదే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రంలో కాకుండా పంచాయతీలకే వెళ్లి, ప్రజల ముంగిళ్లలో కూర్చొని వారి సమస్యలను పరిష్కరించాలని కడా పీడీ నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో నియోజకవర్గ అభివృద్ధి పరమావధిగా 'ప్రజా దర్బారు - మన పంచాయతీ వద్దకు మన ప్రభుత్వం' అనే నూతన కార్యక్రమాన్ని ఆయన ప్రకటించారు. కుప్పం మండలంలోని కంగుంది పంచాయతీలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా దర్బార్ జరగనుంది. ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ కన్వీనర్ డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్‌లతోపాటు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. 'ప్రజా దర్బార్' అయ్యాక మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందరూ కలసి క్షేత్రస్థాయి పర్యటన చేసి, ముఖ్యమైన సమస్యలు గుర్తించి, వీలైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారు.


బాలింతకు చిక్కీల కిట్ అందిస్తున్న పుష్ప

చిక్కీల్లో పురుగులపై విచారణ

గంగవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పౌష్టికాహారంలో పురుగులు రావడంపై ఐసీడీఎస్ సీడీపీవో పుష్ప మంగళవారం విచారణ చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'పౌష్టికాహారంలో పురుగులు' శీర్షికన వచ్చిన వార్తపై స్పందించిన ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీవో పుష్ప మంగళవారం గంగవరం మండలం వి.రామాపురానికి చేరుకొని విచారించారు. అక్కడున్న మినీ అంగన్‌వాడీ సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం పురుగులున్న చిక్కీలను బయటపెట్టిన బాలింత ఇంటివద్దకు వెళ్లి విచారించారు. ఆమెకు నాణ్యమైన చిక్కీలను అందించి ఇకపై అలాంటివి అందకుండా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.పౌష్టికాహారం అందించేపుడే ప్యాకింగ్, గడువు తేదీలను పరిశీలించేలా సిబ్బందిని ఆదేశించామని ఆమె తెలియజేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బిడ్డ సహా తల్లి అదృశ్యం

రామకుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో ఓ వివాహిత తన బిడ్డ సహా అదృశ్యమైంది. ఎస్ఐ వెంకటమోహన్ తెలిపిన వివరాల మేరకు.. రామకుప్పంకు చెందిన అస్రియాకు కొన్నేళ్ల క్రితం తమిళనాడుకు చెందిన వ్యక్తితో వివాహమైంది. పిల్లలు లేకపోవడంతో తన సోదరి కుమార్తెను దత్తత తీసుకొంది. ఈ నేపథ్యంలో ఆ దంపతుల మధ్య విభేదాలు రావడంతో ఈనెల 7వ తేదీన ఆమె బిడ్డతోపాటు రామకుప్పంలోని పుట్టింటికి వచ్చింది. సోమవారం సాయంత్రం చిన్నారితో పాటు ఆమె కన్పించకుండా పోయింది. కుటుంబీకులు ఎంతవెతికినా ఆచూకీ కానరాక పోవడంతో మంగళవారం ఆమె సోదరుడు ముజుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

18న టీటీడీ కార్తీక దీపోత్సవం

తిరుపతి(కల్చరల్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 18వ తేదీ తిరుపతిలో కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు టీటీడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో దీపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.

13మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు

రంపాలు, గొడ్డళ్లు, రెండు ఆటోలు, మోటారు సైకిల్ స్వాధీనం



మంగళం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కల్లూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో 13మంది ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి గొడ్డళ్లు, రంపాలు, రెండు ఆటోలు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు డీఎస్పీ బాలిరెడ్డి మంగళవారం కపిలతీర్థం వద్దగల టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో స్మగ్లర్ల అరెస్టు చూపారు. ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్, అటవీ శాఖ ఎఫ్‌బీవో శ్రీదేవిల బృందం సోమవారం చిత్తూరు జిల్లా ఐరాల అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు ఆటోలలో వచ్చిన కొంతమంది అటవీ ప్రాంతంలోకి ప్రవేశించడాన్ని గుర్తించారు. వారిని చుట్టుముట్టడంతో కొందరు పారిపోగా 13 మంది దొరికారు. వారి నుంచి నాలుగు గొడ్డళ్లు, బరిస, రంపు చుట్టలు స్వాధీనం చేసుకున్నారు. వారిలో 10మంది తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన వారు కాగా మరొకరు కల్లకురుచ్చి జిల్లాకు చెందిన వారు. మరో ఇద్దరు చిత్తూరు నగరానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కుప్పంలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.3.73 కోట్లు మంజూరు

కుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం డివిజన్‌లో తాగునీటి ఎద్దడి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లా 73లక్షలా 70 వేలు మంజూరు చేసింది. గ్రామీణ నీటి సరఫరా శాఖ రూ.373.70 లక్షల వ్యయం అవసరమని మొత్తం 118 తాగునీటి సరఫరా పనులకు పరిపాలనాపరమైన అనుమతుల కోసం ఇటీవల ప్రతిపాదనలు సమర్పించింది. కరువుపీడిత మండలాలైన కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నిధులు అవసరమని పేర్కొంది. ఆర్‌డబ్ల్యూఎస్ ప్రతిపాదనల మేరకు 118 తాగునీటి సరఫరా పనులు చేపట్టడానికి ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

పంటలపై ఆగని గజదాడులు


ధ్వంసమైన వరిపంటను పరిశీలిస్తున్న ఎఫ్‌బీవో శ్రీదేవి

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బోడిరెడ్డిగారిపల్లి, వెంకటదాసరపల్లి పంచాయతీల్లో సోమవారం రాత్రి చెరకు, వరి పంటలను ధ్వంసం చేశాయి. తూర్పు అటవీ విభాగం పరిధిలోని చాకలికోన నుంచి సోమవారం రాత్రి తుడుంవారిపల్లి, వీకే పల్లి, రెడ్డివారిపల్లి, మునిరెడ్డిగారిపల్లి మీదుగా వెళ్లిన ఏనుగుల గుంపు దిన్నెబెస్తపల్లి బస్టాపు వద్ద జాతీయ రహదారిని దాటుకొని పశ్చిమ అటవీవిభాగం పరిధిలోకి అడుగుపెట్టాయి. బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ గౌరిశెట్టివారిపల్లిలోని రైతులు ప్రకాష్, దేవరాజులుకు చెందిన అర ఎకరా వరిపంటను ధ్వంసం చేశాయి. మరో రైతు సుబ్రహ్మణ్యంకు చెందిన వడ్లకుప్పను చిందరవందర చేసి, నాలుగుమూట్లను తినేశాయి. తోటవారిపల్లిలోని రైతు రమణకు చెందిన అర ఎకరా వరిపంటను తొక్కి నాశనం చేశాయి. వెంకటదాసరపల్లిలోని రైతు గోపాల్‌కు చెందిన అర ఎకరా చెరకుపంటను తినేశాయి. అనంతరం చిట్టారెడ్డిపేట, పాతపేట మీదుగా పాతపాళ్యం అడవి సమీపంలోని వంకలో ఏనుగులు తిష్ఠ వేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ధ్వంసమైన పంటలను ఎఫ్‌బీవో శ్రీదేవి పరిశీలించారు.

2.750 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. 2.750 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఒకటో పట్టణ సీఐ జమరామయ్య వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం చిత్తూరులోని కట్టమంచి జంక్షన్ వద్ద ఇద్దరు గంజాయిను విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు అక్కడికి చేరుకుని, అనుమానాస్పదంగా కనిపించిన జీడీ నెల్లూరు మండలం వేల్కూరుకు చెందిన సెల్వం, చిత్తూరు నగరం తేనబండకు చెందిన మురుగన్‌లను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా.. 68.500 విలువైన 2.750 కిలోల గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు గాయాలు


మృతి చెందిన మధు


తిరుపతి (నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తాటితోపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు...ఐరాల మండలం నెల్లిమందకు చెందిన మధు తిరుపతిలో మేస్త్రీగా పనిచేస్తున్నాడు. జీవకోనలో ఉంటున్న ఇతనికి భార్య, కుమారుడు..ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గాయత్రితో కలిసి మంగళవారం బైక్ మీద స్వగ్రామం వెళ్తున్నాడు. ఈక్రమంలో తిరుపతి చెర్లోపల్లి రోడ్డులో ప్రయివేటు ఆసుపత్రి సమీపంలో ఆగి ఉన్న పాల వ్యాన్‌ను ఢీకొన్నాడు. దీంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయత్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను రుయాకు తరలించారు. పాలవ్యాన్ డ్రైవర్ బాలరంగడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరుపతి హోటళ్లలో విస్తృత తనిఖీలు


తనిఖీలు చేస్తున్న మద్దిలేటి, రాజారెడ్డి తదితరులు

తిరుపతి (జీవకోన), నవంబరు 12(ఆంధ్రజ్యోతి):తిరుపతి నగర పరిధిలోని కేటీ రోడ్డులో గల రెస్టారెంట్లలో ఆహార భద్రతాధికారి మద్దిలేటి ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. బిరియాని, గోబీ, నూడిల్స్, చికెన్ తదితర వంటకాలు ఆకర్షణీయంగా ఉండటానికి నిషేధిత రంగులు, రుచికరంగా ఉండటానికి చైనా సాల్ట్ వంటివి వాడటం, ఫ్రిజ్‌లో కుళ్లిన మాంసాన్ని ఉంచడం గమనించారు. వంటశాలలో అపరిశుభ్రత ఉండడంతో కేసులు నమోదు చేశారు. సంబంధిత హోటళ్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. నిల్వ ఆహార పదార్థాలను విక్రయిస్తే రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు జరిమానా, ఆరు నెలల జైలుశిక్ష ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రతినిధులు దేవేంద్ర, సిబ్బంది సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక పద్ధతిపై దృష్టి సారించాలి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

గుడిపాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు సాంకేతిక పద్ధతిపై దృష్టి సారించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చే విధంగా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని కృష్ణజిమ్మాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధి, పొలంబడి, పంటకోతపై చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, హెల్త్ కార్డుల పంపిణీ, ఎరువుల వాడకం, సేంద్రియ వ్యవసాయం, ఈ-పంట నమోదు, పంటల బీమా తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడీ ఉమా, ఏవో మాధవి, పశువర్ధకశాఖ, మార్కెటింగ్, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

పశుగణనలో తేడాలు రాకూడదు

జేడీ ప్రభాకర్


క్షేత్ర స్థాయిలో పశుగణనను తనిఖీ చేస్తున్న జేడీ ప్రభాకర్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనసాగుతున్న 21వ జాతీయ పశుగణనలో ఎలాంటి తేడాలు లేకుండా పక్కాగా లెక్కలు కట్టాలని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ సూచించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా మంగళవారం పలు మండలాల్లోని సాతంబాకం, కొత్తకోట గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఆయన జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో మాట్లాడుతూ జిల్లాలోని 982 గ్రామాలకు గాను, ఇప్పటి వరకు 874 గ్రామాల్లో పశుగణన చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4,64,354 గృహాలకు గాను, 13,866 గృహాల్లోని పాడిపశువుల గణన పూర్తి చేశామన్నారు.

పశుగణనను వేగవంతం చేయండి

పూతలపట్టు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న పశుగణన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ కోరారు. మంగళవారం ఆయన మండలంలోని గొడుగుచింత గ్రామంలో జరుగుతున్న పశుగణన కార్యక్రమాన్ని పరిశీలించారు.

మానవత్వం కన్నా మించిన భక్తి లేదు


రాధామనోహర్ దాస్

చిత్తూరు కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సమాజంలో మానవత్వానికి మించిన భక్తి లేదని, ప్రపంచంలో హైందవ సంస్కృతితో సమానమైన సంస్కృతి లేదని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త రాధామనోహర్‌దాస్ ఉద్ఘాటించారు. స్థానిక నగరపాలక నాగయ్య కళాక్షేత్రంలో నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా భగవత్ వైభవం ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమం చివరగా ఆయన భజగోవిందం శ్లోకాలను భక్తులతో పారాయణం చేయించారు. కార్యక్రమంలో గురజాల చెన్నకేశవులు నాయుడు, కళ్యాణ్ చక్రవర్తి, జీడి గోపి, కేవీఆర్ నారాయణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

జగన్ మొండివైఖరి వీడాలి: గౌనివారి

రామకుప్పం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ మొండి వైఖరి విడనాడాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు హితవు పలికారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ శాసనసభ్యులు అసెంబ్లీకి హాజరుకాకపోవడంపై ఆయన ఆక్షేపించారు. బడ్జెట్‌పై చర్చలో పాల్గొని తగిన సూచనలు, సలహాలు అందించాల్సిన బాధ్యత ఆ పార్టీపై ఉందని పేర్కొన్నారు. అయితే అసెంబ్లీకి రాకపోవడంతో జగన్ వైఖరి ఆ పార్టీకి ఓటు వేసిన ప్రజలను అవమాన పరిచేలా ఉందని తెలియజేశారు. వచ్చిన సీట్లతో వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదని రాజ్యాంగం చెబుతున్నా ఆయన విశ్వసించకపోవడం తగదని తెలిపారు. ఇవన్నీ చూస్తుంటే వైసీపీకి గానీ, జగన్‌కు గానీ ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదన్న విషయం తేటతెల్లమవుతోందని పేర్కొన్నారు.

కుప్పం మండలానికి 3,229 మరుగుదొడ్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయకుమార్ తదితరులు

కుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలానికి 3,229 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరైనట్లు గ్రామీణ సరఫరా శాఖ ఎస్‌ఈ కె.విజయకుమార్ తెలిపారు. స్థానిక మండల సచివాలయంలో మంగళవారం ఆయన మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 15 లోగా మంజూరైన మొత్తం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పీవీ.నరేంద్రకుమార్, డీఈఈ కె.పురుషోత్తం, ఏఈ మధుసూదన్, ఎంపీడీవో సాయిలహరి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఏకాదశి నోములు



ఏకాదశి నోములు ఆచరిస్తున్న భక్తులు

చౌడేపల్లె, నవంబరు12:(ఆంధ్రజ్యోతి) కేదారీశ్వర ఏకాదశి నోములను భక్తులు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. మంగళవారం కార్తీక మాసం ఏకాదశి కావడంతో స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకులు ఏకాదశి నోములు వ్రతాన్ని భక్తులచే ఆచరింపజేశారు. మహిళలు ఆలయం ముందు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

1-బీలో పేరు నమోదు కోసం
ఆరు నెలలుగా తిప్పించుకుంటున్నారు



తన తండ్రి పేరు లేకుండా వస్తున్న 1-బీని చూపిస్తున్న రైతు నారాయణ

చౌడేపల్లె, నవంబరు12:(ఆంధ్రజ్యోతి): 1-బీలో తండ్రి పేరు నమోదు కోసం ఆరు నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని ఓ రైతు వాపోయాడు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు బాధిత రైతు నారాయణ తన ఆవేదన వ్యక్తం చేశాడు. కాగతి పంచాయతీలో ఖాతా నంబరు-58, సర్వేనంబర్ 59/2సీలో నారాయణకు ఎకరం పొలం ఉంది. దీనికి సంబంధించి 1-బీలో ఆయన పేరు ఉంది. తండ్రి పేరు సుబ్బన్న ఉండాల్సిన చోట ఎర్రర్ చూపుతోంది. తండ్రి పేరు చేర్చాలని ఆరునెలలుగా తిరుగుతున్నాడు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

దివ్యాంగురాలిపై దాడి

పుంగనూరు రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవలో దివ్యాంగురాలిపై ఆడపడుచు దాడిచేసి గాయపరిచింది. మండలంలోని నెక్కుందికి చెందిన సుధాకర్, కె. భాగ్యలక్ష్మి(30) దంపతులు. భాగ్యలక్ష్మి దివ్యాంగురాలు. వీరు భాగ్యలక్ష్మి తల్లి నీలావతమ్మ ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామంలో తమ్ముడు వరుస అయ్యే బాలకృష్ణ ఉన్నాడు. ఇతడి భార్య వాణి. ఈ క్రమంలో అత్త నీలావతమ్మ, కోడలు వాణి గొడవపడుతుండగా భాగ్యలక్ష్మి అడ్డుకోబోయింది. ఆ సమయంలో వాణి ఆమెపై గరిటతో తలపై కొట్టడంతో గాయపడింది. పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి ఇంటింటా
క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె, నవంబరు12:(ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కాగతి హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఇంటింటికీ వెళ్లి 30 ఏళ్ల పైబడిన వారికి క్యాన్సర్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే 18 ఏళ్ల పైబడిన వారికి బీపీ, షుగర్, రక్తహీనత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తూ
బస్సు కింద పడి గాయాలు



వైద్యం పొందుతున్న పవన్ కుమార్

సదుం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిగడ్డ గ్రామం మతుకువారి పల్లెకు చెందిన వెంకటరామయ్య కుమారుడు పవన్‌కుమార్(35) మంగళవారం రాత్రి 7 గంటలకు బస్టాండు కూడలిలో రోడ్డుపై వెళుతూ ఓ ప్రైవేటు బస్సు కింద ప్రమాద వశాత్తు పడ్డాడు. సమీపంలోని వ్యక్తులు కేకలు వేసి వెంటనే బస్సును ఆపి వేశారు. అదృష్టవశాత్తు అతను స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ షేక్ షావలి అతడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

గంగవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం గంగవరం మండలంలోని కొత్తపల్లె సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించి సేవలందించాలని సూచించారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టుకు
దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ కుప్పం ప్రాజెక్టు పరిధిలో కుప్పం మండలం గణేశ్‌పురం అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్ (ఎస్టీ రోస్టర్ పాయింట్) పోస్టు ఖాళీగా ఉన్నట్లు సీడీపీవో ఆర్.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న స్థానిక సీడీపీవో దరఖాస్తులు ఇస్తారని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

15న ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

పుంగనూరు రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐటీఐ, పదవ తరగతి. ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18నుంచి 30ఏళ్ల లోపు వయస్సు కలిగిన యువత అర్హులని వివరించారు. వివరాలకు 7780599208ను సంప్రదించాలని కోరారు.

నూతన పద్ధతులతో
అధిక దిగుబడులు

పుంగనూరు రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పంట సాగులో నూతన పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించడానికి రైతులు చొరవ చూపాలని ఏడీఏ శివకుమార్‌రాజు కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సింగిరిగుంట గ్రామంలో రైతులతో ఆయన మాట్లాడారు. పంట సాగు చేయడానికి అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేయడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని తెలియజేశారు.

మద్యం మత్తులో
ఈగల మందు తాగేశాడు

పుంగనూరు రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులవారిపల్లెకు చెందిన ఆంజప్ప(32) మద్యం మత్తులో మంగళవారం ఈగల మందు తాగి స్పృహ కోల్పోయాడు. గుర్తించిన కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు
అనుమతి ఇవ్వండి



రెవిన్యూ కార్యాలయంలో
వినతిపత్రం అందజేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

బైరెడ్డిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసార్లపల్లెలోని ప్రభుత్వస్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయడానికి అనుమతి మంజూరు చేయాలని మంగళవారం దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) నాయకులు నాగరాజు, దామోదరం, రఘు, దాసరిచంద్ర స్థానిక రెవిన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే అధికారులు అభ్యంతరం తెలిపి నిలుపుదల చేయడం బాధాకర మన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

బాటగంగమ్మకు విశేషపూజలు



బైరెడ్డిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో వున్న బాటగంగమ్మ ఆలయంలో మంగళవారం అమ్మ వారికి విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మ వారికి అభిషేకం చేసి ప్రత్యేకపూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపారాధనలతో మొక్కులు చెల్లించుకున్నారు.

టీడీపీ నాయకురాలికి
ఎమ్మెల్యే అమర్ సంతాపం



కామాక్షమ్మ (ఫైల్‌ఫొటో)

గంగవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం నక్కపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు కామాక్షమ్మ మృతి పార్టీకి తీరని లోటు అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. మొరం పంచాయతీ నక్కపల్లె గ్రామానికి చెందిన కామాక్షమ్మ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు.

సభ్యత్వ నమోదులో.. పుంగనూరు ముందుండాలి



కల్లూరులో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):టీడీపీ సభ్యత్వ నమోదులో పుంగనూరు నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో మొదటిస్థానంలో నిలవాలని ఆ పార్టీ పుంగనూరు ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పులిచెర్లలో మంగళవారం టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని తెలిపారు. పార్టీకోసం అనేక మంది కార్యకర్తలు, నాయకులు వివిధ స్థాయిల్లో కష్టపడి పని చేశారన్నారు. పార్టీ కోసం పోరాడి అనేక అక్రమ కేసులు ఎదుర్కొన్నారని వారిని పార్టీ ఎన్నటికీ మరువదన్నారు. అనంతరం పంచాయతీల వారీగా సభ్యత్వంపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథం నాయుడు, సుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, వెంకటరమణ, ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, గోపి నాయుడు, మునికృష్ణమనాయుడు, పురుషోత్తం నాయుడు పాల్గొన్నారు.

చౌడేపల్లె: టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తెళ్లనీళ్లపల్లెలోని టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి అతిథిగృహం వద్ద ఆయన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రూ.వందతో టీడీపీ సభ్యతం నమోదు చేసుకుంటే రూ.5లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు. సభ్యత్వాల నమోదులో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు ఓబుల్‌రెడ్డి, ప్రదీప్‌రాజు, జంపాల శ్రీనివాసులు నాయుడు, కళ్యాణ్, బాబునాయుడు, బోయకొండ శివన్న, కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వేలూరు సుబ్రహ్మణ్యం, చంద్రమౌళి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ రాజకీయాలే జనసేన ధ్యేయం



మాట్లాడుతున్న జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు, నవంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిస్వార్థ రాజకీయాలే జనసేన ధ్యేయమని ఆ దిశగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కృషిచేస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు (ఎన్వీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు) వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చదళ్ల గ్రామంలో ఆయన స్వగృహంలో విలేకరులతో మాటాడారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు మంచి చేయడానికి ఎంతోమంది రాజకీయాల్లోకి రావడానికి సిద్ధంగా ఉన్నా సోషియల్ మీడియాకు భయపడి రావడానికి ఆలోచిస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా ప్రజలకు అందేలా జనసేన పార్టీ పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు శివకుమార్‌రెడ్డి, పగడాల రమణ, విరూపాక్షి, చిన్నారాయల్, చైతన్యరాయల్, నరేంద్రరెడ్డి, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు, మురళి పాల్గొన్నారు.

కార్తీక సోమవారాల్లో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం డిపో నుంచి కార్తీక మాసంలో వచ్చే సోమవారాలలో అంటే ఈనెల 18, 25 తేదీలలో పరిసరాలలోని కొన్ని పుణ్యక్షేత్రాలకు ఒక్కరోజు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా బస్సు సర్వీసులు నడుపుతామని డిపో మేనేజరు గోపీనాథ్ తెలిపారు. మల్లప్పకొండ (మొగిలీశ్వరస్వామి ఆలయం), కోటిలింగాలు (కోటిలింగేశ్వరస్వామి ఆలయం), బంగారు తిరుపతి (వేంకటేశ్వరస్వామి ఆలయం), ఆవణి (సోమేశ్వరస్వామి ఆలయం), కురుడుమలై (వినాయకస్వామి ఆలయం), మొగిలి (మొగిలీశ్వరస్వామి ఆలయం)కు కుప్పం నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. బస్సు ఛార్జీలు పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300లుగా నిర్ణయించారు. రిజర్వేషన్ సౌకర్యం ఉంది. ఆయా ఆలయాలలో దర్శన రుసుము ప్రయాణికులే చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఉదయం 5.30 గంటలకు 96767 సర్వీసు నెంబరు గల బస్సు కుప్పం డిపో నుంచి బయలుదేరుతుంది. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

శ్మశానంలో శివదీక్ష భక్తుల రుద్రహోమాలు



పెద్దఉప్పరపల్లె శ్మశానంలో శివ భక్తులు

సోమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం దుర్గంకొండ మునీశ్వర స్వామి ఆలయంలో పలువురు భక్తులు శివదీక్ష చేపట్టారు. గురు స్వామి త్రివిక్రమ శర్మ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గార్గేయ నదీ తీర శ్మశాన వాటికలో పలు హోమాలు శాస్త్రోక్తంగా జరిపారు. శివుడికి శ్మశానం ప్రీతి పాత్రమైనది కావడంతో శ్మశానంలో ముత్యాల ముగ్గులు, అఖండ జ్యోతులు, దీపాల నడుమ శివలింగాన్ని, నంది వాహనాన్ని ప్రతిష్టించి పాలాభిషేకం చేశారు. గణపతి, గాయత్రీ హోమాలు జరిపారు. రాత్రి జాగరణ చేస్తూ రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం శివదీక్ష భక్తులు సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో శివదీక్ష భక్తులు కోదండరాజు, హేమగిరి, ఈశ్వరాచారి, వేణుగోపాల్, చలపతి, బాబురెడ్డి, లోకేశ్, కుమార్‌రాజ, సాంబ, శంకర్ పాల్గొన్నారు. ఈ నెల 15న దుర్గంకొండలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టిడ్కో కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు
నిరసన తెలుపుతున్న మహిళలు

పుంగనూరు రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో నిర్మించిన టిడ్కో కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించాలని అక్కడి మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణం నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న టిడ్కో ఇళ్లలో ఉన్నామని తెలిపారు. రేషన్ బియ్యం కోసం పట్టణంలోకి రావడానికి ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టాలని, తాగునీటి వసతులు మెరుగు పరచాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఇళ్ల వాసులు యశోదమ్మ, కన్యాకుమారి, బేగం, జాన, రేష్మా, అయేషా, రఫీ, కస్తూరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



సచివాలయంలో
వినతిపత్రాన్ని అందజేస్తున్న భువనేశ్వరి

బైరెడ్డిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచెల్లారగుంట, ఆలప్పల్లె గ్రామాల్లో అపరిష్కృతంగా వున్న ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చొరవ తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు భువనేశ్వరి కోరారు. ఆ మేరకు మంగళవారం ఆయా పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. పారిశుధ్యం మెరుగుపరచాలని, భూసమస్యలను పరిష్కరించాలని, దళితులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విన్నవించారు. ఈనెల 8 నుంచి 15వతేదీ వరకు జరుగుతున్న సీపీఎం ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా ప్రజల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు భువనేశ్వరి తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకోవడం వైసీపీ నైజం



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను అడ్డుకోవడం వైసీపీ నైజమని టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి ఆరోపించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల సమావేశం నిర్వహించి పది రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు అభివృద్ధి పనులు చేయడానికి అనుమతులు ఇవ్వకపోవడం తగదన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను త్వరలోనే బయటకు తీస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాధనం దాదాపు రూ. 1.36కోట్లు గోల్‌మాల్‌చేసిన ఘటనలో పలు అనుమానాలు ఉన్నాయన్నారు. కూలీలకు పనులు కల్పిస్తుంటే వైసీపీ నాయకులు ఉపాధి సిబ్బందిని బెదిరించడం సరికాదన్నారు. టీడీపీ నాయకుడు శమీపతి మాట్లాడుతూ టీడీపీ నాయకులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నేత ఇంటికి ఇటీవల టీటీడీ బోర్డు సభ్యుడుగా బాధ్యతలు తీసుకున్న కృష్ణమూర్తి యాదవ్ వెళ్లడం సరికాదన్నారు. ఎస్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కృష్ణానాయక్, కూటమి నాయకులు సీవీ.రెడ్డి, రెడ్డెప్పయాదవ్, గంగాధర్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, విరూపాక్షి, చైతన్యరాయల్, రమణ, గంగరాజు, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ఉచిత వైద్యం

సోమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం పొందిన సభ్యులకు ఉచిత వైద్య బీమా సదుపాయం ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సి.సుబ్రమణ్యం నాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కందూరు, కామిరెడ్డివారిపల్లె, వల్లిగట్లలో జరుగుతున్న సభ్యత్వ నమోదును పరిశీలించారు. టీడీపీ నాయకులు పి.శ్రీనివాసులు, శంకర్, టి.శ్రీనివాసులు, సుబ్బరాయుడు, బాలకృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

రహదారులకు ప్రత్యేక నిధుల
కేటాయింపు హర్షణీయం

సోమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లపై ఎక్కడా గుంతలు లేకుండా చేయడం కోసం కూటమి ప్రభుత్వం నిధుల కేటాయించడం హర్షణీయమని జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం అన్నారు. మంగళవారం స్థానిక విలేఖరులతో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల మధ్య అనుసంధానం చేసేలా ఎన్‌డీబీ రోడ్లకు నిధులు కేటాయించడం సంతోషమన్నారు. ఎన్టీఆర్ జలసిరి పథకం కింద రైతులకు బోర్లు పథకానికి శ్రీకారం అభినందనీయమన్నారు.

డ్వాక్రా సంఘాల సమాచారం
యాప్‌లో పొందుపరచాలి

సోమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్‌లో పొందు పర చాలని ఏపీఎం శివయ్య తెలిపారు. మంగళవారం వల్లిగట్ల, కామిరెడ్డివారి పల్లెలో జరిగిన గ్రామసమాఖ్య సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తాం



కార్యకర్తలతో చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, నవంబరు12: (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త కుటుంబానికీ న్యాయం చేస్తామని టీడీపీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రొంపిచెర్లలోని టీడీపీ కార్యాలయంలో రొంపిచెర్ల మండలానికి చెందిన 10 పంచాయతీల్లోని నాయ కులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అధికారులతో, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఆయా మండలాల సమస్యలు చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మన్నారు. నాయ కులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో 55శాతం సభ్యత్వ నమోదు జరిగిందని పార్టీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ చెప్పారు.

'సంఘమిత్ర మా డబ్బు స్వాహా చేసింది'

రొంపిచెర్ల, నవంబరు12: (ఆంధ్రజ్యోతి): తమ సంఘానికి చెందిన రూ.5,93,495లు సంఘమిత్ర నందీశ్వరి స్వాహా చేసిందని పులిచెర్ల మండలం రేణుమాకులపల్లె పంచాయతీ ఆర్.వడ్డిపల్లెకు చెందిన శ్రీనివాస గ్రూప్ డ్వాక్రా సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం రొంపిచెర్లలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కలిసి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

కొత్తపేటలో టీడీపీ సభ్యత్వ నమోదు



కుప్పం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 14వ వార్డు పరిధిలోని కొత్తపేటలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేష్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు.

రామకుప్పం: రామకుప్పం మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. మంగళవారం పీఎంకే తాండాలో సభ్యత్వ నమోదు చేపట్టారు. తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్ పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి రైతుకూ గోకులం షెడ్

సోమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పాడి రైతుకూ గోకుల షెడ్ మంజూరవుతుందని టీడీపీ నాయకులు, మాజీ సర్పంచు శ్రీనివాసులు నాయుడు తెలిపారు. మంగళవారం ఇరికిపెంట సమీపంలోని ఒంటిల్లు వద్ద సతీష్ పొలం వద్ద గోకులం షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జేఈ రెడ్డెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెరకు బకాయిలు ఇప్పించండి

నింద్ర, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): చెరకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను నేతమ్స్ షుగర్స్ కర్మాగార యాజమాన్యం చెల్లించేలా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని మంగళవారం సంఘ నాయకులు రాజధాని అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ యాజమాన్యం నుంచి బకాయిలు అందేలా కృషి చేస్తానని చెప్పినట్లు రైతులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఏరియా చెరకు రైతు సంఘ అధ్యక్షుడు గుత్తా నారాయణస్వామి నాయుడు, ఉపాధ్యక్షుడు గజేంద్ర రెడ్డి, కార్యదర్శి పెమ్మసాని మురళీ నాయుడు, సతీష్ తదితరులు ఉన్నారు.


మంత్రి అచ్చెన్నాయుడికి వినతి పత్రం అందిస్తున్న చెరకు రైతు సంఘ నాయకులు

చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు

చిత్తూరు సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రజల చిరకాల కోరిక చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలసి జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు ఆవశ్యకత, ఎన్నికల్లో ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ వినతి పత్రం సమర్పించారు. అడవిపల్లి రిజర్వాయర్ పైప్‌లైన్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని, చిత్తూరులో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వినతులపై సీఎం సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఎస్ఈ తనిఖీలు

చిత్తూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, గుడిపాల మండలాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లను ఆశాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లో పని చేసే షిఫ్ట్ ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతినెల సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ చేయాలన్నారు. లైన్‌మెన్లు ఎప్పటికప్పుడు లేన్లను సరిచేసుకోవాలన్నారు. చీలపల్లి సీఎంసీ హెచ్‌టీ సర్వీసు రీడింగ్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం అనుపల్లి, కొత్తపల్లి, గుడిపాల సబ్‌స్టేషన్లను తనిఖీచేసి, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


రెడ్డిగుంట సబ్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్ఈ

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

చిత్తూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు సంతపేటలోని ఇందిరానగర్ కాలనీలో నివాసముంటున్న మల్లిగ అనే మహిళ కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. తిరుపతిలోని స్విమ్స్, ఇతర ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటోంది. చికిత్స కోసం పెద్ద ఆస్పత్రులకు వెళ్లేందుకు ఆర్థికస్తోమత లేక ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు మంగళవారం ఆమె నివాసానికి వెళ్లి వైద్య ఖర్చులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. దాతలు ముందుకు వచ్చి ఆమెకు ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

కాణిపాకం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామి వారికి విఘ్నేశ్వర పూజ, రక్షాబంధన్, మండలేశ్వరపూజ, గంధ పవిత్ర సమర్పణ తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి గురుప్రసాద్, ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, వేదపండితులు పాల్గొన్నారు.

వసతి గదుల నిర్మాణపు పనుల పరిశీలన

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద వినాయక సదన్ 3, 4 అంతస్తుల వసతి గదుల నిర్మాణపు పనులను ఈవో గురుప్రసాద్ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఏఈ పవన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తాగుబోతు వీరంగం

చిత్తూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం రాత్రి ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. వివరాల్లోకి వెళ్తే... గత కొన్ని నెలలుగా అనంతాపురం వీఆర్‌ఏకు బదులుగా ఆమె కుమారుడు విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని నెలలుగా అతడు విధులకు హాజరు కావడం లేదు. దీంతో అధికారులు ఆమెకు జీతం నిలిపివేశారు. ఈ క్రమంలో ఆమె కుమారుడు మద్యం తాగి వచ్చి కార్యాలయం ఎదుట అధికారులను దుర్భాషలాడాడు. విషయం తెలుసుకున్న తాలుకా పోలీసులు అతడిని అదుపులో తీసుకున్నారు.

కష్టపడే కార్యకర్తకు గుర్తింపు: భూమన

చిత్తూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ఉన్న పార్టీకి ప్రలోభాలకు లొంగిపోయే చీడపురుగులు వద్దని... సైనికుడిలాంటి కార్యకర్త కావాలని వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరణాకరరెడ్డి అన్నారు. మంగళవారం వైసీపీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో విజయానంద రెడ్డి నాయకత్వంలో అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ చంద్రబాబు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రాహుల్ రెడ్డి, కార్పొరేటర్లు జ్ఞాన జగదీశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పాసుబుక్కులు మాకొద్దు

● రెవెన్యూ సభలో రైతుల ఆగ్రహం

గుడిపాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తరతరాల నుంచి రికార్డుల ప్రకారం భూములుంటే రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం ఒకరిభూమిని మరొకరికి ఎల్‌పీ నెంబరు సాకుతో భూముల విస్తీర్ణాన్ని తగ్గించింది. జగనన్న ఫొటోతో ముద్రించిన పాసుబుక్కులు మాకొద్దంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని మొగరాలపల్లె రెవెన్యూ గ్రామంలో పేయనపల్లె, మొగరాలపల్లెలో గ్రామ సభలు తహసీల్దార్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ.. ఈ రెవెన్యూ గ్రామంలోనే 170 మంది రైతుల భూములు రికార్డుల్లో తారుమారు అయ్యాయని, వాటిని సరిదిద్దాలని కోరారు. ఇందుకు స్పందించిన రీసర్వే డీటీ రూపాదేవి మాట్లాడుతూ మీ డిమాండ్లను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు గోపిచంద్, కోటీశ్వర్, కిరణ్, సర్పంచ్ షాఫియా, మాజీ సర్పంచి హరి నాయుడు, రవి యాదవ్, డీలర్ రవినాయుడు, సురేష్, సంగీత, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.


మొగరాలపల్లెలో నిరసన తెలుపుతున్న రైతులు

రీసర్వేవల్ల ఒరిగిందేమీలేదు

గంగాధరనెల్లూరు: వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వే వల్ల రైతులకు ఒరిగిందేమీలేదని జిల్లా టీడీపీ యాదవసాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ అన్నారు. మండలంలోని నెల్లేపల్లెలో సర్పంచ్ గంగయ్య అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేవల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు, తగాదాలను దృష్టిలో ఉంచుకుని సీఎం చంద్రబాబు ఆదేశాలతో తప్పుఒప్పులను సరిదిద్దడానికే రెవిన్యూ అధికారులతో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేతలు దేవరాజులు నాయుడు, పుష్పరాజ్, సుబ్రమణ్యం, సర్వేయర్ సునీత, రీసర్వే డీటీ మహమూబ్ బాషా, టీడీపీ నేతలు తుకారామ్‌రెడ్డి, త్యాగరాజులురెడ్డి, మునికృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి రాజీనామా చేయాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అన్ని వసతులు పొందుతూ, శాసనసభకు వెళ్లి ప్రజల సమస్యలను ప్రస్తావించడానికి తీరికలేని వ్యక్తికి ఎమ్మెల్యే పదవి ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా దమ్మూ, ధైర్యం ఉంటే వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభకు వెళ్లాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మోహన్‌రాజ్, మురళి చౌదరి, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల చేయాలి: యూటీఎఫ్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డీఎస్సీల వారీగా టీచర్ల సీనియారిటీ జాబితా మార్పులు, మెరిట్ ప్రకారం విడుదల చేయాలని యూటీఎఫ్ నాయకులు డీఈవో వరలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆ సంఘం నూతన కార్యవర్గం డీఈవోను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పదోన్నతుల సీనియారిటీ జాబితా విడుదల చేయాలని కోరారు. పని సర్దుబాటులో సవరణ చేయాలని కోరారు. డీఈవోకు వినతి పత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్, సహాధ్యక్షులు రెడ్డప్ప, రెహానాబేగం తదితరులు ఉన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం

వెదురుకుప్పం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీకళాశాల భవన నిర్మాణానికి రూ.17.82 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు, జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ చిత్ర పటాలకు మంగళవారం వెదురుకుప్పంలో టీడీపీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు పోటుగారి గంగయ్య, చంద్రబాబురెడ్డి, మరకాలకుప్పం సుధాకర్, సుధాకర్ రెడ్డి, పి.మోహన్‌మురళి, తాతిరెడ్డి శ్రీరాములురెడ్డి, బీఎం రవి, వరప్రసాద్, ఎస్.మునిచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌ను కలసిన కటారి హేమలత



చిత్తూరు సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ మేయర్ కటారి హేమలత సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. కటారి హేమలతను చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా నియమించిన నేపథ్యంలో మంగళవారం ఆమె అమరావతిలోని వారి నివాసంలో కలసి శ్రీవారి ప్రసాదం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కటారి లావణ్య, కిరణ్, గోపి, లాయర్ బాలాజి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను నివారించాలి

చిత్తూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతాశిశు మరణాలను నివారించాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి వైద్యాధికారులు, ఆశ, అంగనవాడీలను ఆదేశించారు. మంగళవారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతాశిశు మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నగరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ సమీపాన దిగువట్రాక్ మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. మృతుడికి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. సన్నగీతల డిజైన్, లైట్ పింక్ ఆఫ్ షర్టు, బ్లూవైట్ గళ్ల లుంగీ ధరించి ఉన్నట్లు తెలిపారు. గొంతు వద్ద నల్లటి పుట్టు మచ్చ ఉందన్నారు. మృతుడి సమాచారం తెలిసిన వారు 99631 26343 నంబరుకు సమాచారం తెలియజేయాలని కోరారు.

భూ రికార్డుల్లో పేర్లు మార్చేశారు

చిత్తూరు సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భూమి రికార్డుల్లో తమ పేర్లు మారిపోయాయని వి.కోట మండలం గంధారమాకులపల్లెకు చెందిన నారాయణప్ప, రామప్ప ఆరోపించారు. చితూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా గ్రామంలో 4.90 ఎకరాల భూమి సంక్రమించిందని అన్నారు. భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఈసీ సైతం తమ పేరుపై ఉన్నాయన్నారు. 2021లో తమ రికార్డులను తారుమారు చేసి సంబంధం లేని వ్యక్తుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. వెంకటస్వామి, వీరప్ప, ఈశ్వర తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే లక్ష్యసాధన

చిత్తూరు సెంట్రల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతోనే లక్ష్యాన్ని సాధించగలమని జిల్లా బాలల పరిరక్షణాధికారి సుబ్రమణ్యం సూచించారు. 35వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో యాన్యువల్ ట్రైనింగ్ బేస్ క్యాంపును స్థానిక జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో క్యాంపు కమాండెంట్ నోయల్ వివేక్ మోనిస్ ప్రారంభించారు. క్యాంపులో మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్ తదితర విభాగాల్లో శిక్షణతో పాటు ఏ,బీ,సీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.